

"తాతా!"

గొడుగు గుడ్డ మెల్లిగా కుడుతూన్న అప్పయ్య తల మెల్లిగా పైకి లేచింది. బోసినోటి మీద నవ్వు పారాడి, పెదవులు విచ్చుకుని ఎర్రటి చిగుళ్ళు బయట పడ్డాయి. చేతిలో ఉన్న సూదిని తన నల్లటి కోటుకు

## పుష్పము మీ అదృష్టం చెప్పగలదు



మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, మీ సరియైన చర్యనుగురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన మీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, మీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపండి. జ్యోతిషశాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసిన తేదీలగాయతు 12 మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, వ్యవహారములో మీకు జయము కలుగునో, ఉద్యోగం విషయములో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యసంపాదము, పరదేశ గమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీ సుఖము, సంతానము, విధి లిక్కేటం, లాటరీ, అకస్మాత్ ద్రవ్యలాభము మొదలగు వానిని గురించి స్పష్టముగా మాస వారీగా ఫీజు రు. 1-25 న. పై. లకు మాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్ట గ్రహములేమైనా ఉన్నయెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మా పూచీపై పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగానియెడల పైకం వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించండి. అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

**పండిత్ దేవదత్ శాస్త్రి, రాజ్‌జ్యోతిషి (A.W.P.) పో. ఆ. బియాస్ (అమృత్‌సర్)**

**Pt. Dev Dutt Shastri, Raj Jyotishi, (A.W.P.), P.O. BEAS (Amritsar).**







# గొడుగు

గుచ్చుకుని "నువ్వా తల్లీ?" అన్నాడు.

"ఆఁ నేనే, తాతా. గొడుగు బాగు చేశావా?"

అరిచేతి మందం ఉన్న కళ్లద్దాల గుండా ఆమెవైపు, ఆమె పక్కనే ఉన్న నాలుగేళ్ల పసిపాప వైపు చూశాడు.

గత రెండు మూడేళ్లుగా ఆ దోవనే పోయే పంతులమ్మ అప్పయ్యకు బాగా తెలుసు. ఆమెను చూచినప్పుడల్లా పని చేసుకుంటూన్న అతని చేతులు ఆగిపోయేవి. ఏవేవో ఆలోచనలు మనస్సులో మెదిలి రెండు పెద్ద కన్నీటి బిందువులు రాలి పడేవి కళ్లనుంచి.

పంతులమ్మ పక్కనే ఆమె నాలుగేళ్ల కూతురు కొంగు పట్టుకుని నిలబడి కళ్లద్దాల్లోంచి పెద్దవిగా ఆగుపిస్తూన్న కళ్ల వైపు చూచి, "అమ్మా, తాతవి చాలా పెద్ద కళ్లే!" అంది.

అప్పయ్య నవ్వుకుని, "నాకు ఈ అద్దాలు లేకపోతే అగుపించవమ్మా!" అని పంతులమ్మ వైపు చూచి, "నీగొడుగు బాగుచెయ్య లేదమ్మా!" అన్నాడు.

"మావారు గొడుగు లేనిది బయటికి వెళ్లలేరే!" అంది దిగులుగా.

"ఏం అమ్మా?'

"జబ్బు చేసింది, తాతా!"

"అయ్యో ...... సాయంత్రం లోపల బాగుచేసి పెడతానమ్మా. తిరిగి వచ్చేటప్పుడు తీసుకుని పోదువుగాని!"

"సాయంత్రానికన్నా తప్పకుండా ఇసా వా?"

"తప్పకుండా ఇస్తానమ్మా!"

"రా పాపా, పోదాం!"

పంతులమ్మ కూతుర్ని తీసుకుని వెళ్లిపోయింది. ఆమె అగుపించినంతవరకూ చూచి తిరిగి తన పనిలో నిమగ్నుడయ్యాడు అప్పయ్య.

యుద్ధరంగంలోని క్షతగాత్రులైన సైనికుల్లా అప్పయ్య చుట్టూరా ఎన్నో గొడుగులు పడి ఉన్నాయి. కొన్ని గుడ్డలు చినిగినవి. కొన్ని కమ్ములు విరిగినవి. కొన్ని కర్రలు పోయినవి. ఆ ఊరికల్లా గొడుగులు బాగా చేసేది అప్పయ్య ఒక్కడే. అతనికి చిన్నతనం నుండీ అదే వృత్తిట. రోడ్డు పక్కనే ఉన్న చెట్టు కింద ఎప్పుడూ అగుపిస్తాడు. అతనికి ఇల్లూ వాకిలీ ఉన్నట్టు తోచదు, అలా ఉండడం చూస్తే.

ఆ ఊళ్లో అప్పయ్య కంటే వయస్సు మీరినవాడు ఉండడేమో అనిపిస్తుంది. పూర్తిగా నెరిసిన తల, నేలకు వంగిపోయిన నడుము, ముడతలు పడిపోయిన శరీరము, ఒక్క పన్నయినా లేని నోరు.

కొన్ని బాగు చేసిన గొడుగులు చెట్టుకానించి ఉంటాయి. మధ్యాహ్నం లోపల ఎవరి గొడుగులు వాళ్లు తీసుకు వెళ్లారు. రెండు రూపాయలదాకా కూలి డబ్బులు ముట్టాయి. బాగు చేస్తూన్న గొడుగు అవతల పెట్టి, మెల్లిగా లేచి వంగిపోయిన నడుముతో ఎదురుగా ఉన్న బంకు దగ్గిరికి వెళ్లాడు.

బంకు అతను, "ఏం తాతా? ఏం కావాలి?"

అన్నాడు.

"బిస్కెట్టు పొట్లం కావాలి, నాయనా."

"పదణాలవుతుంది. ఇమ్మంటావూ?"

"ఆ. "

బంకు ఆసామీకి పది అణాలిచ్చి, బిస్కెట్టు పొట్లం అందుకుని తిరిగి తన చెట్టు దగ్గిరికి వచ్చాడు, అప్పయ్య.

ఒక ఆడమనిషి అన్నం ఉన్న బుట్ట పక్కన పెట్టుకుని కూర్చుని ఉంది. అప్పయ్యను చూస్తూనే, "వచ్చావా, తాతా!. . . కూడు తింటావా?" అంది.

"కూటికేం గానీ, నీ యాపారం ఎట్టా ఉందే, మంగా?" అని అడుగుతూ కూర్చున్నాడు.

మంగ అప్పయ్య చేతిలో ఉన్న బిస్కట్టు పొట్లాన్ని చూచి, "అబ్బో తాతా, నీకు బిస్కట్లమీద మనసు మళ్లిందే!" అంది.

"నాకు కాదే, మంగా. నా మనవరాలికి!"

"నీకు మనవరాలేంటి?"

"ఏం నేనేం మనిషిని గాదూ! కూడు పెట్టి పో! ... ఇందరూపాయి ఉంచు!" అని ఒక రూపాయి కాగితాన్ని మంగ చేతిలో ఉంచాడు.

మంగ తామరాకులో ఒక తట్టనిండా అన్నం పెట్టి, దానిమీద పులుసు పోసి, అప్పయ్యకు అందిచ్చింది.

"బావికి పోయి నీళ్లు పట్టుకొస్తావా, మంగా?"

మంగ ఒక ముంత నిండా నీళ్లు తెచ్చిఇచ్చి అన్నం బుట్ట తిరిగి నెత్తిన పెట్టుకుని, పులుసు గిన్నె అందుకుని వెళ్లిపోయింది.

అప్పయ్య చేతులు కడుక్కుని అన్నం తిని, ముంతెడు మంచినీళ్లు తాగి తిరిగి ఒక గొడుగు అందుకున్నాడు. ఒక గొడుగు బాగు చేస్తూ చేస్తూ తలెత్తి చూచాడు. పంతులమ్మ కూతురు వెనక చేతులు కట్టుకుని నిలబడి తదేకంగా తన పని వైపు చూస్తూ అగుపించింది.

"నువ్వా అమ్మా . . . . అమ్మేది?"

"రాలా, తాతా!"

"ఒక్కదానివే వచ్చావా?"

"ఆ. మా అమ్మ గొడుగివ్వవూ ... అదుగో అది... బాగుచేశావా?" అని పంతులమ్మ కూతురు అక్కడ పడిఉన్న ఒక గొడుగు వైపు చూపింది.

అప్పయ్య ఆ గొడుగు తీసుకుని ఒకసారి తెరిచి చూచి, "కమ్ములూడి పోయి ఉన్నాయమ్మా. బాగుచేసి ఇస్తానీ . . . . ఇట్లారా!" అని ఆ అమ్మాయిని దగ్గిరికి తీసుకున్నాడు.

"మా అమ్మ తిడుతుంది!" అని వదిలించుకో సాగింది అమ్మాయి.

"తిట్టదులే అమ్మా. నేను మీ తాతనేగా! చూడు నీకు బిస్కట్టు పొట్లాం తెచ్చా!" అని గొడుగుల చాటున ఉన్న దాన్ని తీసి చూపాడు.

అమ్మాయి ఒకసారి నవ్వి, "నాకేనా,తాతా?" అంది.

"ఆ నీకేనమ్మా.....నీ పేరేమిటి?"

"లక్ష్మి."

"బాగుందమ్మా. లక్ష్మి .... బాగుంది. మీ అమ్మతో చెప్పి వచ్చావా?"

"లేదు, తాతా . . . . గొడుగియ్యి. పోతా!"

"సాయంత్రం లోపల బాగుచేసి ఇస్తానమ్మా.... ఒంటరిగా ఎందుకు వచ్చావమ్మా......పద, నిన్ను అమ్మ

**ఎముక పడేస్తే తింటుంది కుక్క. పిలిచి నోటి కందిస్తే తోక ఆడించి కృతజ్ఞత చూపి మరీ తింటుంది; జ్ఞప్తి ఉంచుకొంటుంది. ప్రపంచంలో ఎందరో దురదృష్టవంతులు, దిక్కులేనివారు. ఆదరంతో ఒక్కమాట అంటే ప్రాణం ఉన్నంతకాలమూ గుర్తు ఉంచుకొని ఆనందంతో కష్ట సముద్రం ఈదుతారు. ఇది గుర్తు ఉండేది ఎందరికి ?**

దగ్గిర వదిలి పెడతా!"

"గొడుగు, తాతా!"

"నేను మీ అమ్మ కిస్తాలే ..... కార్లు, బళ్లు .. ఎందు కొచ్చావమ్మా!"

అప్పయ్య నడుము వంచుకుని నడుస్తూంటే లక్ష్మి అంత ఎత్తే ఉన్నాడు. లక్ష్మి చెయ్యి పట్టుకుని అరమైలు దూరాన ఉన్న బడి దగ్గిరికి వెళ్లాడు. కూతురు కోసం పంతులమ్మ బయట నిలబడి ఆదుర్దాగ చూస్తూంది. అప్పయ్య వెంబడి తన కూతురు రావడం చూచి, గబగబా ముందుకు వచ్చి కావలించుకుని, "ఎక్కడికి వెళ్లావే, లక్ష్మి?" అంది.

"తాత దగ్గిరి కమ్మా. గొడుగు తెద్దామని... చూడు తాత నాకు ఇది ఇచ్చాడు!" అని లక్ష్మి బిస్కెట్టు పొట్లం చూపింది.

"ఎందుకు, తాతా, ఇది ఇచ్చావ్? పిల్లలికి ఇట్లా అలవాటు చెయ్యొచ్చా ..... లక్ష్మీ, ఇచ్చెయ్యమ్మా!" అంది పంతులమ్మ.

"ఆ మాట అనకమ్మా . . . . . నా అనేవాళ్లు నా కెవ్వరూ లేరమ్మా. నిన్ను చూచినప్పుడు ఏదో ఆనందం నాలో కలుగుతూంది ...... లక్ష్మిని ఏమీ అనకమ్మా!" అన్నాడు.

పంతులమ్మ గుండెలు ఒకసారి కదిలినట్లయ్యాయి. కాస్సేపు అప్పయ్య వైపు చూచి, "నిజమే, తాతా. దిక్కు లేనివాళ్లు లోకంలో ఎందరో ఉన్నారు. అందులో నువ్వు ఒకడివి. నేనొకదాన్ని. మావాళ్లెవరూ లేరు. నాకూ నీ అంత తండ్రి ఉండేవాడు. పక్షవాతం వచ్చి చచ్చిపోయాడు... నీకు ఇష్టమైతే, నీపని అయిన తరవాత మాకు తోడుగా మా ఇంటికి వచ్చి పడుకోరాదూ? నిన్నే మానాన్న అనుకుంటాను!" అంది.

అంత అభిమానాన్ని ఎప్పుడూ నోచుకోని జీవితం అప్పయ్యది. పంతులమ్మ కేం చెప్పాలో తెలియక నిలబడ్డాడు. ఆనందంలో ఊపిరాడక, మెల్లిగా తేరుకుని "అట్లాగేనమ్మా. కానీ ఈబొందె రాలిపోతే అనుకునే వాళ్లు ఎక్కడున్నారు!" అన్నాడు.

"ఎందుకు లేరు, తాతా?"

"ఎవరమ్మా?"

"దేవుడు. మనలాంటి వాళ్లను ఎప్పుడూ కాపాడాలని అనుకుంటాడేగానీ కాపాడడు ...... కాదనకుండా రా, తాతయ్యా. నిన్నే మా నాన్న అనుకుని ఆనందపడతాను!" అంది పంతులమ్మ.

"అవును. రా తాతా ..... మా అమ్మ పిలుస్తూంటే!" అంది లక్ష్మి.

కాదనలేదు అప్పయ్య. "అలాగేనమ్మా. మీరెవరో, నేనెవరో, ఈ ఋణానుబంధం ఏమిటో! అలాగే వస్తానమ్మా ..... గొడుగు బాగు చెయ్యాలి!" అన్నాడు.

"ఎవరం అయినా మనుషులమేగా, తాతా! మనిషిని మనిషిగా చూచే మనుషులు మనలోనే ఎక్కువగా ఉంటారు, తాతా..... పద. గొడుగు బాగు చెయ్యి!" అని పంతులమ్మ కూతుర్ని వెంట బెట్టుకుని బడిలోకి వెళ్లిపోయింది.

కాటికి కాళ్లు చాస్తున్నా వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్లయింది అప్పయ్యకు. అభిమానం పంచిపెట్టే ఆప్తులు లభించారని సంబర పడ్డాడు. అతని కళ్లు సంతోషంతో మసకలు కమ్మాయి. కన్నీరు తుడుచుకుని బ్రతకాలనే ఆశ ఇనుమడిస్తూంటే తిరిగి వచ్చి తన చెట్టు కింద కూర్చున్నాడు.

తక్కిన గొడుగు లన్నింటిని పక్కకు నెట్టి పంతులమ్మ గొడుగు తీసుకున్నాడు. గుడ్డ పైభాగంలో చినిగిఉంది. రెండు కమ్ములు ఊడి ఉన్నాయి.

అప్పయ్య కమ్ములను సర్ది, తీగవేసి బిగించాడు. ఎనభై ఏళ్ల తరవాత యౌవనం వచ్చినట్లుంది అతనికి. సూది, నల్ల దారం తీసుకుని, మెల్లిగా గుడ్డ కుట్టి రెండు మూడుమార్లు అది అంతా పరీక్షించి చూచాడు. అప్పటికి కానీ అతనికి తృప్తి కలగలేదు. నాలుగైదు మార్లు గొడుగు ముడిచి తెరిచి చూచాడు. బాగుందన్నట్లు తల ఆడించాడు. గొడుగు తెరిచి ఒక పక్కన పెట్టి, నిమ్మళంగా చెట్టు కానుకుని దాని వైపే చూడ సాగాడు.

ఎండ తగ్గుతూంటే రోడ్డుపై రద్దీ ఎక్కువై పోసాగింది. కార్లు, బళ్లు ఎడతెరిపి లేకుండా అటూ ఇటూ తిరగ సాగాయి. పైగా దగ్గర్లో ట్రంకురోడ్డు మీదే బస్సుస్టాండు. అది ఆ చుట్టు పక్కల ఊళ్లకంతా కూడలి. వచ్చేపోయే బస్సులను చూస్తూ పంతులమ్మ రాకకోసం ఎదురు చూస్తున్న అప్పయ్యకు చల్లగాలి తగిలింది. హాయిగా తోచింది. మెల్లిగా, చల్లగా తోచిన ఆగాలి అరనిమిషంలో సుడిగాలిగా మారి, తెరిచి ఉంచిన పంతులమ్మ గొడుగు ఈడ్చుకు పోయింది.

అప్పయ్య గుండెలు ఝల్లు మన్నాయి. ఉన్న పళాన లేచి గాలికి కొట్టుకుపోతున్న గొడుగు వెంట గబగబా నడిచాడు నడుము వంచుకునే.

ఎలాగైతేనేం గొడుగు పట్టుకుని, ముడిచి గుండెలకు అదుముకున్నాడు అప్పయ్య. ఆ క్షణంలో తప్పిపోయిన బిడ్డ దొరికిన తల్లిలాగైపోయాడు.

గొడుగు చంకన పెట్టుకుని మెల్లిగా తన చెట్టు దగ్గిరికి వస్తూ, ఎదురుగా వచ్చి మీద పడబోతున్న రిక్షాను తప్పించుకుని పక్కకు అడుగుపెట్టే లోపల వెనకనుండి వస్తూన్న లారీ ఆ ఎముకల గూటిని తొక్కుకుంటూ వెళ్లిపోయింది.

అప్పయ్య నడుము నలిగిపోయినా పంతులమ్మ గొడుగు చెక్కు చెదరలేదు! ★

**కావుటూరు**
**వేంకటనారాయణరావు**